## ప్రజాజ్యోతి తెలుగు జాతీయ పత్రికకు విలేకరులు కావలెను

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా వార్తల్లో నిర్భయంగా ముందుకు దూసుకుపోతున్న ప్రజాజ్యోతి దినపత్రికకు వివిధ మండలాలకు రిపోర్టర్లు కావలెను. బిచ్కుంద. బీర్కూర్. తాడ్వాయి. లింగంపేట, నస్రుల్లాబాద్, దోంగ్లీ, మహమ్మద్‌నగర్, ఎల్లారెడ్డి మండలాలకు రిపోర్టర్‌లు కావలెను.

ఈ క్రింది నెంబర్ ను సంప్రదించండి.

96665 56646



జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం, ఫిబ్రవరి 11, 2026 పేజీలు: 8


# నేటి పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

- డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాలకు తరలిన ఎన్నికల సామగ్రి
- దగ్గరుండి పరిశీలించిన జిల్లా కలెక్టర్
- పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి ప్రతినిధి ఫిబ్రవరి 10. (ప్రజాజ్యోతి) 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యం లో జిల్లాలో నేడు జరగనున్న పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రం లోని ఎస్పీ కార్యాలయం లోని ఏఎంసి గోడౌన్ లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించి, ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను దగ్గరుండి పరిశీలించారు.

-మిగతా 2లో..

## భీంగల్ మున్సిపల్ ఎన్నికల

# ఏర్పాట్ల పరిశీలన

**స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్**



నిజామాబాద్ రూరల్: ఫిబ్రవరి, 10 (ప్రజా జ్యోతి) ఫిబ్రవరి 11న జరగనున్న భీంగల్ మున్సిపల్ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్., సోమవారం భీంగల్ పట్టణంలో పర్యటించి ఎన్నికల ఏర్పాట్లను క్షుణ్ణంగా పర్యవేక్షించారు. భీంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ఎన్నికలు ముగిసిన అనంతరం భీంగల్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ పోలింగ్ బూత్‌ల

-మిగతా 2లో..





## ప్రత్యేక వ్యూహంతోనే

# గిరిజన వికాసం

ఇందల్వాయి (ప్రజాజ్యోతి న్యూస్ ) ఫిబ్రవరి 10

తెలంగాణ విజన్ 2047, సమగ్ర అభివృద్ధి, మానవ వనరుల వికాసం, సమాన అవకాశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఈ లక్ష్యాలను సాధించడంలో గిరిజన యువతపై రాష్ట్రం చేసే పెట్టుబడి చాలా కీలక పాత్ర పోషించనుంది. ఇప్పటివరకు తగిన విధంగా వినియోగించుకోని, అపార సామర్థ్యం కలిగిన

-మిగతా 2లో..



# నేటి పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

కామారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలలో నిర్వహిస్తున్న 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాట్లు సజావుగా సాగుతున్నాయని తెలిపారు.

పోలింగ్ ప్రక్రియ నిరంతరాయంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల అధికారులు ఎన్నికల సామగ్రిని సకాలంలో, సురక్షితంగా సంబంధిత పోలింగ్ కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బంది, భద్రతా సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎన్నికలను విజయవంతం చేయాలని సూచించారు.

ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అవసరమైన మౌలిక వసతులు అన్ని పోలింగ్ కేంద్రాల్లో కల్పించినట్లు తెలిపారు. జిల్లాలో స్వేచ్ఛాయుత, న్యాయమైన ఎన్నికలు నిర్వహించేందుకు యంత్రాంగం పూర్తిగా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. పోలింగ్‌కు సంబంధించి సిబ్బందితో పాటు ఎన్నికల సామగ్రిని బస్సుల ద్వారా పోలింగ్ కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. విధులు నిర్వహించే అధికారులు పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని, ఏవైనా సమస్యలు తలెత్తితే తక్షణమే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఎన్నికల అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ సామగ్రిని చెక్‌లిస్ట్ ఆధారంగా పరిశీలించుకోవాలని, పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న అనంతరం అవసరమైన అన్ని వస్తువులు తమ వద్ద ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని ఆదేశించారు. రిజర్వ్ కౌంటర్, స్పెషల్ కౌంటర్లలో పోలింగ్‌కు సంబంధించిన బ్యాలెట్ పేపర్లు, ఫారాలు, కవర్లు తదితర సామగ్రిని సరిచూసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో రిపోర్టింగ్ అనంతరం జోనల్ అధికారులు రూట్ వారీగా పోలింగ్ సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు పంపించడంలో సహకరిస్తారని తెలిపారు.



పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుని బుధవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని, పోలింగ్ ఉదయం 7.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు ఉంటుందని, పోలింగ్‌కు ముందు మాక్ పోలింగ్ నిర్వహించాలని సూచించారు.

పోలింగ్ విధులు నిర్వహించే అధికారులు తమ కేంద్రాలకు తరలి వెళ్లే సమయం నుంచి కౌంటింగ్ పూర్తి చేసి రిసెప్షన్ కేంద్రానికి చేరుకునే వరకు అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

పోలింగ్ సిబ్బందికి అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన వసతులు, బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

## భీంగల్ మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

నుంచి వచ్చే బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కౌంటింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

అనంతరం ఆయన పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. పోలింగ్ రోజు బూత్‌ల వద్ద ప్రజలు గుమిగూడకుండా తగిన చర్యలు తీసుకోవాలని, శాంతియుతంగా ఎన్నికల ప్రక్రియ సాగేందుకు పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, సిటీ ఏసీపీ రాజశేఖర్, భీంగల్ మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్, భీంగల్ సీఐ పొన్నం సత్యనారాయణ, ఎస్సైలు తిరుపతి (భీంగల్), అనిల్ (కమ్మర్పల్లి), రాము (మోర్తాడ్), రాజేశ్వర్ (ఏర్గట్ల), ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్, ఎంఆర్వో ఎం.డి. షబీర్‌తో పాటు ఎన్నికల పరిశీలకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

### పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్, సీపీ పిలుపు

నిజామాబాద్ రూరల్: ఫిబ్రవరి, 10 (ప్రజా జ్యోతి)

మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో ప్రతి ఓటరు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య పిలుపునిచ్చారు. 11 తేదీ న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనున్న నేపథ్యంలో జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్, సీపీ ఎన్నికల ఏర్పాట్లను వివరించారు. నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీల్లో ప్రశాంత వాతావరణంలో సాఫీగా ఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించారు.నిజామాబాద్ నగర పాలక సంస్థ పరిధిలో 60 డివిజన్లలో 3,48,116 మంది ఓటర్లకు గాను 488 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే బోధన్‌లో 111, ఆర్మూర్‌లో 106, భీంగల్‌లో 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించి, ఈ నెల 13న ఓట్ల లెక్కింపు చేపడతామని తెలిపారు.రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో మొత్తం 4,375 మంది పోలింగ్ సిబ్బందిని నియమించామని, అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. ఓటింగ్ శాతం పెంచేందుకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఓటరు స్లిప్పుల పంపిణీ దాదాపు పూర్తయిందని తెలిపారు.పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ... ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. ఏడు ఏసీపీలు, 70 మంది సీఐలు, 70 మంది ఎస్సైలు సహా 1,370 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించాలని సూచించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ పాల్గొన్నారు.



### ప్రత్యేక వ్యూహంతోనే

## గిరిజన వికాసం

గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించడం విజన్- 2047 అమలులో ప్రధాన అంశంగా మారాల్సిన అవసరం ఉంది. జనగణన, రాష్ట్ర అంచనాల ప్రకారం తెలంగాణలో గిరిజనుల జనాభా 32.70 లక్షలు ఉంది. ఇది రాష్ట్ర జనాభాలో సుమారు 10 శాతం. ఇందులో 70 శాతం కంటే ఎక్కువ మంది షెడ్యూల్డ్ ప్రాంతాల్లో, మైదాన ప్రాంతాలలో నివసిస్తున్నారు. ముఖ్యంగా గిరిజన జనాభాలో 55 శాతం పైగా 30 సంవత్సరాల లోపు యువత ఉండటం రాష్ట్రానికి ఒక పెద్ద వరంగా చెప్పవచ్చు. అయితే విద్య, ఉపాధి వంటి రంగాల్లో ఉన్న నిర్మాణాత్మక అసమానతల వల్ల ఈ మానవ వనరు పూర్తిగా సత్ఫలితాలుగా మారడం లేదు. తెలంగాణలో గిరిజనుల అక్షరాస్యత రేటు సుమారు 63 శాతమే ఉండగా, రాష్ట్ర సగటు అక్షరాస్యత 72 శాతానికి పైగా ఉంది. అలాగే మాధ్యమిక స్థాయిలో గిరిజన ప్రాంతాల్లో పాఠశాల విడిచిపెట్టే గిరిజన విద్యార్థుల శాతం ఇంకా ఎక్కువగానే ఉంది.

గిరిజన యువతలో సుమారు 70 శాతం మంది వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలపై ఆధారపడుతూ, రైతులుగా లేదా దినసరి కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. దీనివల్ల ఆదాయ భద్రత లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. గిరిజన యువతలో దాదాపు 15 శాతం కన్నా తక్కువ మందికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వివిధ నైపుణ్య శిక్షణ లభించిందన్న అంచనాలు ఉన్నాయి. తయారీ, సేవలు, సాంకేతిక రంగాల్లో వారి భాగస్వామ్యం చాలా తక్కువ. ఇది రాష్ట్ర దీర్ఘకాలిక అభివృద్ధికి సవాలుగా ఉండగా, వ్యూహాత్మక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఈ పరిస్థితిని మార్చగలవు.

సంప్రదాయ జీవనోపాధి బలోపేతం ఆవశ్యకత: స్థానిక పరిస్థితులకు, గిరిజన సంస్కృతి, జీవన విధానాలకు అనుగుణమైన శిక్షణా కార్యక్రమాలు అవసరం. గిరిజన ప్రాంతాల్లో సహజ వనరులు, మానవ వనరులు సమృద్ధిగా ఉన్నాయి. చిన్న అటవీ ఉత్పత్తులు, వెదురు, ఔషధ మొక్కల ఆధారిత ఉత్పత్తులు, హస్తకళలు, సంప్రదాయ కళలలో విలువ జోడింపు చేయగలిగితే స్థిరమైన జీవనోపాధులు ఏర్పడతాయి. ఆధునిక నైపుణ్యాలు, నాణ్యత ధ్రువీకరణ, బ్రాండింగ్, మార్కెట్ అనుసంధానం కల్పిస్తే అటవీ ఉత్పత్తుల ద్వారా వచ్చే ఆదాయం 30 -50 శాతం వరకు పెరిగే అవకాశం ఉంటుంది. తద్వారా గిరిజన యువతతోపాటు గిరిజన మహిళలకు కూడా ప్రత్యక్ష లాభం చేకూరుతుంది.సంప్రదాయ జీవనోపాధి బలోపేతం ఆవశ్యకత: స్థానిక పరిస్థితులకు, గిరిజన సంస్కృతి, జీవన విధానాలకు అనుగుణమైన శిక్షణా కార్యక్రమాలు అవసరం. గిరిజన ప్రాంతాల్లో సహజ వనరులు, మానవ వనరులు సమృద్ధిగా ఉన్నాయి. చిన్న అటవీ ఉత్పత్తులు, వెదురు, ఔషధ మొక్కల ఆధారిత ఉత్పత్తులు, హస్తకళలు, సంప్రదాయ కళలలో విలువ జోడింపు చేయగలిగితే స్థిరమైన జీవనోపాధులు ఏర్పడతాయి. ఆధునిక నైపుణ్యాలు, నాణ్యత ధ్రువీకరణ, బ్రాండింగ్, మార్కెట్ అనుసంధానం కల్పిస్తే అటవీ ఉత్పత్తుల ద్వారా వచ్చే ఆదాయం 30 -50 శాతం వరకు పెరిగే అవకాశం ఉంటుంది. తద్వారా గిరిజన యువతతోపాటు గిరిజన మహిళలకు కూడా ప్రత్యక్ష లాభం చేకూరుతుంది.గిరిజన యువతకు డిజిటల్ విద్య: ప్రభుత్వ పాలన, విద్య, ఉపాధి రంగాలు డిజిటలైజ్ అవుతున్న తరుణంలో డిజిటల్ భాగస్వామ్యం అత్యంత కీలకం. డిజిటల్ విద్య లేమి గిరిజన యువతను వెనుకబాటుకు నెట్టే ప్రమాదం ఉంది. గిరిజన గ్రామాల్లో ఇంటర్నెట్ వినియోగం, డిజిటల్ పరిజ్ఞానం రాష్ట్ర సగటుతో పోలిస్తే తక్కువగా ఉంది. ప్రాథమిక డిజిటల్ నైపుణ్యాలు, ఐటి సేవలు, మౌలిక సదుపాయాలు అందిస్తే మారుమూల గిరిజన ప్రాంతాల్లో డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఆధారిత ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఇదివిజన్- 2047లో ఊహించిన జ్ఞాన ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా ఉంటుంది.నైపుణ్యాభివృద్ధి ఫలితాలు సాధించాలంటే అనుబంధ కార్యక్రమాలు కూడా కీలకం. ప్రాథమిక, మాధ్యమిక విద్య బలోపేతంచేయడంతో పాటు, పోషణ, ఆరోగ్యం, భాషా మాధ్యమం, ఆర్థిక చేకూర్పు వంటి అంశాలు శిక్షణను ఉపాధిగా మారుస్తాయి. గిరిజన మహిళలు,ఆదిమ గిరిజన తెగలు (పివిటిజిఎస్)పై ప్రత్యేక దృష్టి పెట్టడం అత్యవసరం. ఎందుకంటే వారు అనేక స్థాయిల్లో వెనుకబాటుకు గురవుతున్నప్పటికీ సమాజ స్థిరత్వంలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

తెలంగాణ విజన్- 2047 విజయవంతం కావాలంటే అభివృద్ధి ఫలాలు అత్యంత మారుమూల, ఏజెన్సీ ప్రాంతాలలోని ఉన్న, అట్టడుగు వర్గాల వరకు చేరాలి. గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించడం కేవలం సంక్షేమ చర్య కాదు, ఇది దీర్ఘకాలిక ఆర్థిక అభివృద్ధి వ్యూహం. డేటా ఆధారిత ప్రణాళిక, బలమైన సంస్థాగత వ్యవస్థలు, పరిశ్రమలకు అనుగుణమైన శిక్షణతో గిరిజన యువతను నైపుణ్యవంతులైన ఉద్యోగులుగా, వ్యాపారవేత్తలుగా, ఆవిష్కర్తలుగా తీర్చిదిద్ద గలదు. అలా గిరిజన యువతను రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో క్రియాశీల భాగస్వాములుగా 2047 నాటికి సమృద్ధి, సమానత్వం, స్థిరత్వం కలిగిన తెలంగాణను నిర్మించవచ్చు

# పరిశ్రమలతో ఉపాధిని చూసాం.. కానీ ఇక్కడ?

- పర్యావరణ పరిరక్షణ మండల ప్రజల బాధ్యత కాదా
- ప్రజా ఆరోగ్యానికి పరిణమిస్తున్న ముప్పు
- పరిశ్రమ మునగడకు పాలకుల వత్తాసు
- ఎం ఎస్ ఎన్ పరిశ్రమ కాలుష్యంపై నియంత్రణ లేదు
- ప్రాణాల్ని హరిస్తున్న ఎంఎస్ఎన్
- ఎంఎస్ఎన్ పై సామాన్యుడి పోరాటం
- గొల్ల మహేందర్ యాదవ్






కామారెడ్డి (ఆర్ సి)ఫిబ్రవరి 10 భిక్కనూరు (ప్రజాజ్యోతి)

ప్రకృతి ఒడిలో సేదతీరుతున్న పచ్చని గ్రామాలను అభివృద్ధి పేరుతో కాలుష్యం కూరలోకి నెట్టేసిన పాపం ఎవరిది? పరిస్థితులకు తలవంచి భూములను అమ్ముకున్న రైతులదా, ఉపాధి అవకాశాలను ఊహించి అభివృద్ధి జరుగుతుందని అనుమతులు ఇచ్చిన అధికారులదా? వలసలు పోతున్న పల్లె గ్రామీణ యువతకు అరచేతిలో వైకుంఠం ని చూపించిన వైనం కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండల శివార్లలో గత 15 సంవత్సరాల క్రితం అతి చిన్న పరిశ్రమగా ఏర్పాటై ప్రస్తుతం 300 ఎకరాల విస్తీర్ణంలో విజృంభిస్తుంది. ఈ పరిశ్రమ నుండి వాయు కాలుష్యం, భూగర్భ జలాలు సైతం రంగు మారి కాలుష్యం కొరలో చిక్కుకున్నాయి. ఇటీవల జనవరి 14 తారీఖున కంచర్ల గ్రామానికి చెందిన గొల్ల భాగయ్య అనారోగ్య సమస్యలతో మృతి చెందాడు. నా తండ్రి మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి ఉంటే ఎంఎస్ఎన్ కంపెనీ బాగోతం బయటపడేదని ఆవేదన వ్యక్తం చేశాడు. గత నెల 14 నుండి నేటి వరకు నా తండ్రికి జరిగిన అన్యాయం వేరే ఎవరికీ జరగకూడదు అని ఒంటరిగా పోరాడుతున్న ఏ ఒక్క అధికారి, ప్రజా ప్రతినిధి స్పందించకపోవడం కలచి వేస్తుందని బాధపడ్డాడు. ఎంఎస్ఎన్ పరిశ్రమ యాజమాన్యం ఇచ్చే ముడుపులు తీసుకున్న అధికారులు, ప్రజాప్రతినిధులు నోరు మెదపకుండా చోద్యం చూస్తున్నారు. ఇకనైనా మండల వాసులంతా మేల్కొని పరిశ్రమ మూతపడే విధంగా నడుం బిగించాల్సిన సమయం ఆసన్నమైంది. నాకు మద్దతుగా మండలంలో నుండి కానీ, గ్రామం నుండి కానీ ఏ ఒక్కరూ రాకున్నా, నా కుటుంబం అంతా కలిసి ఎమ్మెఎస్ఎన్ పరిశ్రమల లాకౌట్ కోసం అసెంబ్లీ, సీఎం క్యాంప్ ఆఫీసు ముందు పురుగుల మందు తాగి చావడానికైనా సిద్ధమని అధికారులను డిమాండ్ చేశాడు.

# సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి

సదాశివనగర్ ఫిబ్రవరి 10 (ప్రజాజ్యోతి)

ఈ నెల 15న సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక వేడుకలు నిర్వహించాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు సురేందర్ రాథోడ్ పేర్కొన్నారు. ఈ వేడుకలకు జిల్లాలోని అన్ని గిరిజన సంఘ సభ్యులు హాజరుకావాలని కోరారు. దేశవ్యాప్తంగా ఉన్న 16 కోట్ల మంది గిరిజనులకు సేవాలాల్ మార్గదర్శి, ఆదర్శప్రాయుడని కొనియాడారు. సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఈల్జిపూర్ శివారులో జగదంబమాత, సేవాలాల్ ఆలయ ప్రాంగణం వద్ద మహా భోగ్ బండర్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసే కార్యక్రమంలో బంజారా నాయకులు,ఆయా గిరిజన సంఘాల నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం




జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ నాయక్, జిల్లా యూత్ అధ్యక్షుడు శంకర్ నాయక్, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు, కామారెడ్డి డివిజన్ అధ్యక్షుడు సదర్ నాయక్, కామారెడ్డి టౌన్ అధ్యక్షుడు దేవునాయక్, కార్యదర్శి రమేష్ నాయక్, సదాశివనగర్ మండల ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, శ్రీనివాస్ నాయక్, బాలు, నాజం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ సమయ సూచన పట్టిక

- దూరప్రాంత భక్తుల సౌకర్యార్థం సమయ సూచి
-ఆలయ ఈవో కి టీజీవీపీ వినతి పత్రం

కామారెడ్డి (ఆర్ సి) ఫిబ్రవరి 10 బిక్కనూరు (ప్రజాజ్యోతి)

కామారెడ్డి జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ స్వయంభు సిద్ధ రామేశ్వర ఆలయానికి ఎంతో ప్రత్యేక చరిత్ర కలదు. ఇంతటి ఘన చరిత్ర కలిగిన ఆలయాన్ని దర్శించుకోవడానికి దూరప్రాంతాల నుంచి వేయ ప్రయాసల నోచి వస్తున్న భక్తుల సౌకర్యార్థం ఆలయంలో దర్శన సమయాల బోర్డు ఏర్పాటు చేయవలసిందిగా కోరుతూ టీజీవిపి మండల అధ్యక్షుడు దేవుని భరత్ రాజ్ ఆలయ కార్య నిర్వహణ అధికారి శ్రీధర్ కి వినతి పత్రాన్ని సమర్పించాడు.

ఈ ఆలయం 1971 సంవత్సరంలో ప్రభుత్వ ఎండోమెంట్ శాఖ పరిధిలోకి వచ్చి 55 సంవత్సరాలు అయినప్పటికీ ఆలయంలో దర్శన సమయాలను తెలియజేసే టైమింగ్ బోర్డు ఏర్పాటు చేయలేదని, టికెట్ కౌంటర్ కూడా నిర్ణీత సమయానికి తెరిచి ఉండకపోవడం వల్ల భక్తులు వేచి ఉండాల్సి వస్తోందని, అదేవిధంగా ఆలయ ప్రాంగణంలోని మరుగుదొడ్ల లో సరైన వెలుతురు లేకపోవడం వల్ల ముఖ్యంగా శివమాల ధరించిన స్వాములు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది భద్రత మరియు సౌకర్యాల కు కూడా సమస్యగా మారుతుంది. కాబట్టి ఎంతో పురాతన ప్రాశస్త్యం కలిగిన ఆలయాన్ని అభివృద్ధి చేసుకొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఈ వినతి పత్రంలో పేర్కొన్నాడు. ఈ కార్యక్రమంలో టిజిబిపి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



# అమ్మఒడి కార్యక్రమం





కామారెడ్డి (ఆర్ సి)ఫిబ్రవరి 10 బిక్కనూరు (ప్రజాజ్యోతి)

భిక్కనూరు మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో వైద్యాధికారి దివ్య అమ్మ ఒడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమంలో మండలంలోని వివిధ గ్రామాల నుండి గర్భిణీ స్త్రీలను ఆశా కార్యకర్తలు తీసుకొచ్చి, రక్త పరీక్షలు, బరువు, ఎత్తు, రక్తపోటు పరీక్షలు చేసి పౌష్టికాహార విలువలను గర్భిణీ స్త్రీలు అందరికీ వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య విస్తరణాధికారి వెంకటరమణ ల్యాబ్ టెక్నీషియన్ వన శ్రీ, హెల్త్ అసిస్టెంట్ హేమలత,ఎమ్మెల్యే హెచ్ పి పూజ,యశోద పాల్గొన్నారు.

# శివాలయ నిర్మాణానికి రూ. 51వేల116 లు విరాళం అందజేత

నాగిరెడ్డిపేట్, ఫిబ్రవరి10(ప్రజాజ్యోతి):

నాగిరెడ్డిపేట్ మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయం నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి సాయిబాబా రూ.51 వేల116 విరాళంను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.ఈ సందర్బంగా ఆలయం నిర్మాణానికి విరాళం అందించిన సాయిబాబాను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కన్నారెడ్డి గ్రామానికి చెందిన సాయిబాబా వివిధ రకాల సేవా కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, ఆలయ నిర్మాణంలో తమవంతు సహకారం అందించిన పరమేశ్వరుని ఆశిస్సులు ఉండాలని గ్రామస్తులు కోరారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మనోహర్ రెడ్డి,మాజీ సర్పంచ్ బాల్ రెడ్డి,భాస్కర్ రెడ్డి,గ్రామ పెద్దలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పడమటి దుర్గేష్,మంగలి యాదగిరి,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## పదవి అంటే అధికారం కాదు... బాధ్యత అని నిరూపించిన గున్కుల్ సర్పంచ్

నిజాంసాగర్ ప్రజా జ్యోతి జనవరి 10
గ్రామ పాలనలో ప్రజాప్రతినిధి పాత్ర ఎలా ఉండాలనే దానికి గున్కుల్ గ్రామ సర్పంచ్ గంగి రమేష్ ఉత్తమ ఉదాహరణగా నిలిచారు. పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ అనారోగ్య కారణాలతో సెలవులో ఉండటంతో గ్రామ పరిశుభ్రత పనులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. అయితే గ్రామం అపరిశుభ్రంగా మారకుండా, ప్రజలకు అసౌకర్యం కలగకూడదన్న ఉద్దేశంతో సర్పంచ్ గంగి రమేష్ స్వయంగా రంగంలోకి దిగారు.పంచాయతీ ట్రాక్టర్ ఎక్కిన సర్పంచ్, గ్రామంలోని పలు కాలనీలు, వీధులు తిరుగుతూ చెత్తను స్వయంగా సేకరించారు. సాధారణంగా ప్రజాప్రతినిధులు ఆదేశాలు ఇవ్వడానికే పరిమితమవుతుంటే, గంగి రమేష్ మాత్రం పనిని ముందుండి చేసి చూపించడం ద్వారా తన బాధ్యతను చాటుకున్నారు. ఆయన చేసిన ఈ చర్య గ్రామంలో పరిశుభ్రతపై అవగాహన పెంచడమే కాకుండా, ప్రజల్లో పాలకులపై నమ్మకాన్ని మరింత బలపరిచింది.సర్పంచ్ స్వయంగా చెత్త సేకరణ చేయడాన్ని చూసిన గ్రామస్థులు ఆశ్చర్యంతో పాటు ఆనందం వ్యక్తం చేశారు. “పదవి అంటే అధికారమనే భావనను పక్కన పెట్టి, బాధ్యతగా భావించి పనిచేసే నాయకుడు మా సర్పంచ్” అంటూ గ్రామస్తులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. గ్రామాభివృద్ధి, పరిశుభ్రత, ప్రజాసేవే లక్ష్యంగా గంగి రమేష్ చేస్తున్న సేవలు ఇతర ప్రజాప్రతినిధులకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.ఈ సంఘటనతో గ్రామంలో పరిశుభ్రతపై కొత్త ఉత్సాహం నెలకొనగా, ప్రజలు కూడా స్వచ్ఛత కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సర్పంచ్ పిలుపునిచ్చారు.




## రోడ్డు ప్రమాద మృతుడి కుటుంబానికి పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థుల అండ



గాంధారి, ఫిబ్రవరి 10 (ప్రజాజ్యోతి)
రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పూర్వ విద్యార్థి కుటుంబానికి పూర్వ ఉపాధ్యాయ బృందం, పూర్వ విద్యార్థులు ఆర్థికంగా అండగా నిలిచారు. లింగంపేట్ మండలంలోని బాణాపూర్ శివారులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో పూర్వ విద్యార్థి బాదావత్ లాల్ సింగ్ మృతి చెందాడు.గాంధారి మండలంలోని మర్లకుంట తండాకు చెందిన లాల్ సింగ్ కూరగాయలు విక్రయించి తిరిగి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకోవడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పూర్వ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పేట్ సంగెం వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో స్పందించి మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు.లాల్ సింగ్ అకాల మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన వారు, కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు శంకర్, భూమేశ్వర్, బాలరాజు, బాల అర్జున్ గౌడ్, పూర్వ విద్యార్థులు విఠల్, రామాగౌడ్, గణేష్, ప్రవీణ్, దశరథ్, సుభాష్, సంజీవ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

**– జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

కామారెడ్డి ప్రతినిధి ఫిబ్రవరి 10. (ప్రజాజ్యోతి)
2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నేడు జరగనున్న పోలింగ్ అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు.ఎన్నికల కోసం నోటిఫై చేయబడిన ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, దుకాణాలు, కర్మాగారాలలో పనిచేసే ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు , స్థానిక సంస్థలకు స్థానిక సెలవు ప్రకటించడం జరిగిందని పేర్కొన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగస్వాములుగా ప్రతి ఓటరు బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



## కారు ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు




నాగిరెడ్డిపేట్, ఫిబ్రవరి10(ప్రజాజ్యోతి):
నాగిరెడ్డిపేట్ మండలంలోని మాల్తుమ్మెద గేటు వద్ద జాతీయ రహదారిపై కారు ఢీకొని మాల్తుమ్మెద గ్రామానికి చెందిన వృద్ధుడు సిద్దిగారి భూమయ్య తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు.స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం మెదక్ నుంచి బోధన్ వైపు వెళ్తున్న కారు మాల్తుమ్మెద గేటు వద్ద టీవీఎస్ ఎక్సెల్ ను ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో టీవీఎస్ పై వస్తున్న మాల్తుమ్మెద గ్రామానికి చెందిన సిద్దిగారి భూమయ్య తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు.గాయపడిన భూమయ్యను చికిత్స నిమిత్తం మెదక్ లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు స్థానికులు తెలిపారు.ఈ సంఘటన పై ఇప్పటివరకు తమకు ఎలాంటి పిర్యాదు రాలేదని ఎస్సై భార్గవ్ గౌడ్ తెలిపారు.

## రాష్ట్రస్థాయి సీఎం కప్ హ్యాండ్‌బాల్ పోటీలకు పోతంగల్ కలాన్ విద్యార్థినులు ఎంపిక

గాంధారి, ఫిబ్రవరి 10 (ప్రజాజ్యోతి)
గాంధారి మండలంలోని పోతంగల్ కలాన్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు జిల్లా స్థాయి సీఎం కప్ హ్యాండ్‌బాల్ బాలికల విభాగంలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. కామారెడ్డి జిల్లా గురుకుల పాఠశాల ఉప్పల్‌వాయిలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో అబ్దుల్ అలియా, కాటార్య లావణ్య, బస్సి సురేఖ, బస్సి రేఖ, అస్మిత, సాగరికలు అద్భుత ప్రదర్శన కనబరిచినట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నాగరాజు తెలిపారు.ఈ పోటీల్లో విశేష ప్రతిభ చూపిన అబ్దుల్ అలియాను కామారెడ్డి జిల్లా హ్యాండ్‌బాల్ బాలికల జట్టుకు కెప్టెన్‌గా నియమించినట్లు ఆయన వెల్లడించారు. ఈ నెల 20 నుంచి 23 వరకు హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి సీఎం కప్ హ్యాండ్‌బాల్ పోటీల్లో వీరు పాల్గొంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగారావు తెలిపారు.రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ఉపాధ్యాయ బృందం, గ్రామ సర్పంచ్ అనుశ్రీ బాల్ రాజు, ఉపసర్పంచ్ సంజీవ్ రెడ్డి, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు అభినందించారు.



## గాంధారిలో 108 అంబులెన్సుపై ఆకస్మిక తనిఖీ



గాంధారి, ఫిబ్రవరి 10 (ప్రజాజ్యోతి)
కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలో ఉన్న 108 అంబులెన్సును ప్రోగ్రాం మేనేజర్ జనార్ధన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్సులో అవసరమైన వైద్య పరికరాలు, ఆక్సిజన్ సిలిండర్, అత్యవసర మందులు అందు బాటులో ఉన్నాయా అనే అం శాలను సవివరంగా పరిశీలి ంచారు.అత్యవసర పరిస్థి తుల్లో సేవల్లో ఎలాంటి లోపాలు లేకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ తిరుపతి, 108 సిబ్బంది ఈఎంటి సురేష్, పైలట్ ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు.

## రంగుల హంగులతో మెరిసిన అల్లాపూర్ ప్రాథమిక పాఠశాల

పిట్లం, ఫిబ్రవరి 10, (ప్రజా జ్యోతి)
పిట్లం మండల కేంద్రంలోని గ్రామంలో ప్రాథమిక పాఠశాలను ఉపాధ్యాయులు-- గ్రామస్తుల సహకారంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పాఠశాల పరిధిలోని మూడు భవనాలు, ప్రహరీ గోడతో పాటు తరగతి గదులను విద్యార్థులను ఆకట్టుకునేలా రంగులతో సుందరంగా ముస్తాబు చేశారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యంగా హెడ్‌మాస్టర్ ఎం. రాము, సహోపాధ్యాయుడు జె. బస్వరాజ్ ప్రత్యేక చొరవ తీసుకొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వారి కృషికి గ్రామస్తులు, గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.
రంగుల హంగులతో మెరిసిపోతున్న తరగతి గదులు విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించడంతో పాటు, పాఠశాల వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చాయని గ్రామస్తులు పేర్కొన్నారు.



# దొంగతనం కేసులో దంపతుల అరెస్ట్

## సీసీటీవీ--టెక్నికల్ ఆధారాలతో పోలీసులు కేసు ఛేదన
## ఆటో, మొబైల్ ఫోన్, వెండి వస్తువులు స్వాధీనం



**సదాశివనగర్ ఫిబ్రవరి 10 (ప్రజాజ్యోతి)**

తాళం వేసిన ఇళ్లే టార్గెట్ గా దొంగలు దొంగతనాలకు పాల్పడుతున్నారు. సదాశివనగర్ మండలం పద్మాజీవాడి ఎక్స్ రోడ్ గ్రామానికి చెందిన యాళ్ల సురేష్ 05-02-2026 రోజున ఎప్పటిలాగే ఇంటికి తాళం వేసి, పొలం పనుల నిమిత్తం భార్యతో కలిసి పొలానికి వెళ్లగా, పిల్లలు స్కూలుకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి, గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి మూడు పట గొలుసుల జతలు, ?15,000 నగదు మరియు రెండు గ్రాముల బంగారు దుద్దులు దొంగిలించారు. బాధితులు యాళ్ల సురేష్ సదాశివ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సమాచారం అందుకున్న పోలీసులు బాధితుని వద్దకు వెళ్లి, సిటిజన్ సెంట్రింగ్ విధానం ద్వారా పిటిషన్ స్వీకరించి, అక్కడికక్కడే కేసు నమోదు చేసి, బాధితునికి కేసు కాగితాలు అందజేశారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ శ్రీ యం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు సదాశివనగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ సంతోష్ పర్యవేక్షణలో సదాశివనగర్ ఎస్‌హెచ్ఓ పుష్పరాజు మరియు సిబ్బంది ఘటన స్థలాన్ని పరిశీలించి, అక్కడ ఉన్న సీసీటీవీ కెమెరాల ఫుటేజ్ మరియు ఇతర సాంకేతిక ఆధారాలపై లోతుగా దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో నిందితులు బాలె నర్సింలు ఏ చింటూ ఏ చిన్న (25) మరియు బొల్లిపల్లి రేణుక ఏ మైలారం రేణుక (21) కలిసి ఆటోను నేర సాధనంగా ఉపయోగించి, పద్మజీవాడి ఎక్స్ రోడ్ ప్రాంతంలో హౌస్ బ్రేకింగ్ చేసి బంగారు, వెండి ఆభరణాలు మరియు నగదును దోచుకున్నట్లు తేలింది. విశ్వసనీయ సమాచారం మేరకు నిందితులను చీఎ-44 మల్లన్నగుట్ట వద్ద పట్టుకొని, వారి వద్ద నుంచి ఆటో, మొబైల్ ఫోన్ మరియు వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు ఛేదనలో సదాశివనగర్ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్, సదాశివనగర్ ఎస్హెచ్ఓ పుష్పరాజు, కానిస్టేబుల్ కె.రవి, అజర్ ఫారూక్, అబ్దుల్ హమీద్, స్వర్ణలత, శశికాంత్, నరేష్, శ్రీకాంత్ రెడ్డి లను జిల్లా ఎస్పీ అభినందించారు. గ్రామాలలో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని నేరాలు జరుగుతున్నందున ప్రతి ఇంటిలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 కు లేదా సదాశివ నగర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సదాశివనగర్ పోలీసులు ప్రజలను కోరుతున్నారు.

# గౌరారంలో శ్రీ సాయిబాబా ఆలయ 7వ వార్షికోత్సవ వేడుకలు



**గాంధారి, ఫిబ్రవరి 10 (ప్రజాజ్యోతి)**

గాంధారి మండలంలోని గౌరారం గ్రామంలో మంగళవారం శ్రీ సాయిబాబా ఆలయ 7వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తానాజీ రావు, ఆలయ దాత దుర్గా రెడ్డి, ముదేల్లి సొసైటీ చైర్మన్ సాయిరాం, స్థానిక సర్పంచ్ అనిల్ గౌడ్, మాజీ ఎంపీటీసీ అంజయ్య, మాజీ ఉపసర్పంచ్ విఠల్, మాజీ సర్పంచ్ జయరాం, డైరెక్టర్ దాన సాయిలు, దెంక బాలరాజ్, మాజీ డైరెక్టర్ తుమ్ అంజయ్యతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభావిత జొన్న పంటల పరిశీలన... ఎరువుల దుకాణాల తనిఖీ



**గాంధారి, ఫిబ్రవరి 10 (ప్రజాజ్యోతి)**

గాంధారి మండలంలో మంగళవారం ఏఈవోతో కలిసి పోతంగల్ కలాన్, పేట్ సంగం గ్రామాల్లోని ప్రభావిత జొన్న పంట పొలాలను వ్యవసాయ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా పంట నష్ట పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు వ్యవసాయ అధికారి రాజలింగం తెలిపారు. అనంతరం పోతంగల్ కలాన్, గాంధారి గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఫర్టిలైజర్ యాప్ ద్వారా యూరియా ఎరువుల నిల్వలు, పంపిణీ వివరాలను ధృవీకరించి నిబంధనల ప్రకారం విక్రయాలు జరగాలని సంబంధిత దుకాణదారులకు సూచించారు.

# ఇస్రోజీవాడి శబ్దిపూర్ గ్రామాలలో స్కూళ్లను సందర్శించిన ఏపీఎం శ్రీనివాస్





**కామారెడ్డి రూరల్ ఫిబ్రవరి 10 ప్రజా జ్యోతి**

కామారెడ్డి మండలంలో విద్యా--పోషణ--మహిళా సాధికారతకు విస్తృత
శబ్దిపూర్ లో స్కూల్ యూనిఫామ్ కొలతలు, అంగన్వాడీ కేంద్ర సందర్శన
ఇస్రోజీవాడిలో గ్రామ సంఘం సమావేశంలో పాల్గొన్న ఏపీఎం శ్రీనివాస్

కామారెడ్డి మండలంలో విద్యార్థుల విద్యాభివృద్ధి, చిన్నారుల ఆరోగ్యం--పోషణ, మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఏపీఎం శ్రీనివాస్ పాల్గొని సంబంధిత అంశాలపై సమీక్షించారు. స్కూల్ విద్యార్థులకు యూనిఫామ్ కొలతలు

మండల పరిధిలోని శబ్దిపూర్ గ్రామంలో ప్రైమరీ మరియు హై స్కూల్‌లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌ల కొలతలు తీసుకునే కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులందరికీ నాణ్యమైన యూనిఫామ్‌లు సమయానికి అందేలా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. యూనిఫామ్‌లు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచడంతో పాటు పాఠశాలలపై ఆసక్తి పెరిగేలా చేస్తాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీసీ గంగారెడ్డి, సంఘం అధ్యక్షురాలు గోదావరి, పాఠశాల హెడ్మాస్టర్ లక్ష్మారెడ్డి, వివోఏలు, టైలర్లు పాల్గొని విద్యార్థుల కొలతలు సక్రమంగా నమోదు చేశారు.

అంగన్వాడీ కేంద్రం సందర్శనఅనంతరం శబ్దిపూర్. గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఏపీఎం శ్రీనివాస్ బృందం సందర్శించింది. కేంద్రంలో అమలవుతున్న ఎస్ఏఎం (), ఎంఏఎం () కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు.

చిన్నారుల పోషణ స్థాయి, బరువు, ఎత్తు, హాజరు, ఆహార నాణ్యత వంటి అంశాలపై అంగన్వాడీ టీచర్ నుంచి వివరాలు సేకరించారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదగాలంటే తల్లిదండ్రులు, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఏపీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, సీసీ గంగారెడ్డి, డాక్టర్ రవళి, సంఘం అధ్యక్షురాలు గోదావరి, అంగన్వాడీ టీచర్ వనమాల పాల్గొన్నారు.

ఇస్రోజీవాడిలో గ్రామ సంఘం సమావేశం

ఇక కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామ సంఘం సమావేశానికి ఏపీఎం శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సమావేశంలో మహిళా సంఘాల పనితీరు, ఆర్థిక పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు లింకేజీ టార్గెట్‌లు, ఎన్‌పీఏ రికవరీ, స్కూల్ యూనిఫామ్‌ల స్టిచ్చింగ్ పనులు, పీఎంఈ యూనిట్ల గుర్తింపు, 'అమ్మకు అక్షరమాల' కార్యక్రమం అమలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఏపీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ, మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడితే గ్రామాభివృద్ధి వేగంగా జరుగుతుందని అన్నారు. ప్రతి సంఘం లక్ష్యాలను సాధించే దిశగా క్రమశిక్షణతో పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీసీ గంగారెడ్డి, సంఘం అధ్యక్షురాలు కవిత, వివోఏ శివకుమార్, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించడంపై గ్రామ ప్రజలు, మహిళా సంఘ సభ్యులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఉపాధి హామీ పనులు ప్రారంభించిన సర్పంచ్

**రామారెడ్డి ఫిబ్రవరి 10 (ప్రజా జ్యోతి)**

రామారెడ్డి మండలంలో గల గొల్లపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు ప్రారంభించిన సర్పంచ్ కిషన్ యాదవ్ ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మధు, వార్డ్ మెంబర్ మంజుల ప్రభాకర్, రెడ్డిమల్లేష్, సెక్రెటరీ జనార్ధన్, మండల్ ఏపీవో ధర్మారెడ్డి,గ్రామ పాలకవర్గం, మేట్ నవీన, ఉపాధి హామీ కూలీలు రామారెడ్డి గ్రామం రాజమ్మ తండా అడవి ప్రాంతంలో ప్రారంభించడం జరిగింది.



# వన దుర్గ పెద్దమ్మ దేవాలయంలో చోరీ

**బీబీపేట్ మండల్ ప్రజా జ్యోతి ఫిబ్రవరి 10**

బీబీపేట మండల కేంద్రంలో గల పెద్దమ్మతల్లి ఆలయంలో బంగారు ఆభరణాల చోరీ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే గత శనివారం ఉదయం 9.30సి.ల ప్రాంతంలో ఒకరు భక్తురాలిగా వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకొని అనంతరం ఆలయ పర్యవేక్షకులు ఎవరి పనిలో వారు నిమగ్నమై ఉండగా భక్తురాలు ఇదే అదునుగా తీసుకొని అమ్మవారి మెడలో ఉన్న దాదాపు ఒక తులం బంగారు పుస్తులను కత్తెర సహాయంతో కత్తిరించి దొంగిలించడం జరిగింది. ఇట్టి విషయాన్ని ఆలయ పర్యవేక్షకులు సి సి కెమెరాలలో రికార్డు అయ్యాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న బీబీపేట పోలీస్ స్టేషన్ సిబ్బంది స్పందించి వెంటనే ఆలయ ప్రాంగణం వద్దకు వచ్చి పోలీసులు సిసి ఫుటేజ్ చూసి ఇట్టి విషయాన్ని బయట పెడితే దుండగులు తగు జాగ్రత్తలు తీసుకుంటారని గోప్యంగా ఉంచామన్నారు. ఈ విషయంపై పోలీసులను విచారణ కోరగా దొంగతనం చేసింది మహిళ అని అది వాస్తవమే అని అట్టి మహిళను పట్టుకునేందుకు ప్రత్యేక బృందం ద్వారా దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# గురుదేవ్ జాతర మహోత్సవానికి ఘన ఏర్పాట్లు

**ముఖ్య అతిథిగా గురు చందన్ సింగ్ మహారాజ్**



**గాంధారి, ఫిబ్రవరి 13 (ప్రజాజ్యోతి)**

గాంధారి మండలంలోని బీర్మల్ తాండలో 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ గురుదేవ్ జాతర మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ జాతర మహోత్సవం ఫిబ్రవరి 13 శుక్రవారం నుండి 14 శనివారం వరకు జరగనుంది. ఈ సందర్భంగా బీర్మల్ తాండలోని గురుదేవ్ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతర మహోత్సవానికి ముఖ్య అతిథిగా గురు చందన్ సింగ్ మహారాజ్ శుక్రవారం సాయంత్రం 4 గంటలకు హాజరుకానున్నారని వెల్లడించారు. గురుదేవ ఆశీస్సులతో భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు జండా ఆవిష్కరణతో జాతర ఉత్సవాలు ప్రారంభమవుతాయని, అనంతరం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. 14వ తేదీ శనివారం రోజున ప్రధాన జాతర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ముఖ్యంగా భక్తుల సౌకర్యార్థం నిజామాబాద్ నుండి బీర్మల్ తాండ, గాంధారి వరకు బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. మండలంతో పాటు పరిసర గ్రామాలు, తాండాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. శనివారం రోజున అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా బీర్మల్ తాండ ప్రజలు మాట్లాడుతూ, భక్తులు అందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి గురుదేవ సాత్ జీ ఆశీర్వాదం పొందాలని కోరారు. ఈ గురుదేవ జాతర మహోత్సవాన్ని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# సీఎం కప్ 2025--26 హాకీ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం







**కామారెడ్డి రూరల్ ఫిబ్రవరి 10 ప్రజా జ్యోతి**

కామారెడ్డి జిల్లాలోని జడ్.పి.హెచ్.ఎస్ గర్గుల్ పాఠశాల మైదానంలో సీఎం కప్ 2025--26లో భాగంగా నిర్వహించిన హాకీ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డివైస్ఓ రంగ వెంకటేశ్వర్ గౌడ్ హాజరై విజేతలకు బహుమతులు అందజేసి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా డివైస్ఓ రంగ వెంకటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీయడమే సీఎం కప్ ప్రధాన లక్ష్యమని, క్రీడల ద్వారా విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారని పేర్కొన్నారు. ఇలాంటి టోర్నమెంట్లు భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు వీరబ్రహ్మం , టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నోముల మధుసూదన్ రెడ్డి వ్యాయామ ఉపాధ్యాయులు వెంకట్, ఆంజనేయులు, లక్ష్మణ్, మానస తదితరులు పాల్గొన్నారు. వారు టోర్నమెంట్ విజయవంతంగా నిర్వహించినందుకు నిర్వాహకులను అభినందించారు.

హాకీ టోర్నమెంట్‌లో బాలుర విభాగంలో ప్రథమ స్థానం జడ్.పి.హెచ్.ఎస్ గర్గుల్, ద్వితీయ స్థానం జడ్.పి.హెచ్.ఎస్ బీబీపేట్ జట్లు సాధించాయి. బాలికల విభాగంలో ప్రథమ స్థానం జడ్.పి.హెచ్.ఎస్ గర్గుల్, ద్వితీయ స్థానం కేజీబీవీ బిక్నూర్ జట్లు సాధించి ప్రతిభను చాటాయి. చివరగా విజేత జట్లకు ట్రోఫీలు, పతకాలు అందజేసి క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని టోర్నమెంట్‌ను విజయవంతం చేశారు.

## వంట గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉంచాలి

**అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్**

**నిజామాబాద్ ఫిబ్రవరి 10 :**

పవిత్ర రంజాన్ మాసాన్ని దృష్టిలో పెట్టుకొని వంట గ్యాస్ సిలిండర్లు వినియోగదారులకు అందుబాటులో ఉంచాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ గ్యాస్ ఏజెన్సీల డీలర్లను ఆదేశించారు. మంగళవారం ఆయన తన ఛాంబర్ లో పౌర సరఫరాల శాఖ అధికారులతో కలిసి గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. రంజాన్ మాసం సందర్భంగా డిమాండ్ కు అనుగుణంగా వంట గ్యాస్ సిలిండర్లు వినియోగదారులకు అందించేందుకు వీలుగా ముందస్తుగానే సరిపడా స్టాక్ ను తెప్పించుకోవాలని సూచించారు. వంట గ్యాస్ సిలిండర్ల కొరత ఏర్పడకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని, గ్యాస్ సిలిండర్ల పంపిణీ తీరును నిశితంగా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, అధికారులు అరవింద్ రెడ్డి, రవి రాథోడ్, ఏజెన్సీల నిర్వాహకులు పాల్గొన్నారు.



## సీఎం కప్ 2025-26 కామారెడ్డి జిల్లా స్థాయి చేస్ మరియు క్యారమ్





**కామారెడ్డి రూరల్ ఫిబ్రవరి 10 ప్రజా జ్యోతి**

లయోలా ఉన్నత పాఠశాల కామారెడ్డి లో నిర్వహించడం జరిగింది ముగింపు కార్యక్రమానికి డివైస్ఓ రంగ వెంకటేశ్వర్ గౌడ్ హాజరై బహుమతుల ప్రధాన ఉత్సవం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పహీమ్ గారు చెస్ ఇంచార్జ్ రామకృష్ణ , క్యారమ్స్ ఇంచార్జ్ సలాం ఖాన్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నోముల మధుసూదన్ రెడ్డి ఎస్ జి ఎఫ్ సెక్రటరీ వెంకటి వ్యాయామ ఉపాధ్యాయులు హన్మంతు రెడ్డి ప్రభులింగం సంతోష్ నరేష్ రెడ్డి విజయలక్ష్మి చెస్ మరియు క్యారమ్ లలో 200 క్రీడాకారులు పాల్గొనడం జరిగింది.

## సీఎం కప్ జిల్లాస్థాయి పోటిల్లో మైనుకు ద్వితీయ స్థానం



**నాగిరెడ్డిపేట్, ఫిబ్రవరి 10(ప్రజాజ్యోతి):**

సీఎం కప్ జిల్లాస్థాయి క్యారమ్ పోటిల్లో గోపాల్ పేట్ గ్రామానికి చెందిన మైను ద్వితీయ స్థానం దక్కించుకున్నట్లు పీడీ సబాత్ కృష్ణ తెలిపారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని లయోల పాఠశాలలో క్యారం,చెస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటిల్లో సింగిల్స్ లో 30 మంది క్రీడాకారుల, డబుల్స్ లొ 25 జట్లు పాల్గొనగ,ఈ రెండు విభాగల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మైను ద్వితీయ స్థానాన్ని సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్న మైనుకు గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు,పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ వో రంగా వేంకటేశ్వర్ గౌడ్,వ్యాయమ ఉపాధ్యాయులు మధుసూదన్ రెడ్డి,నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## గర్గుల్ గ్రామంలో తప్పిన పెను ప్రమాదం

**కామారెడ్డి రూరల్ ఫిబ్రవరి 10 ప్రజా జ్యోతి**

గర్గుల్ గ్రామంలో మంగళవారం భారీ ప్రమాదం త్రుటిలో తప్పింది అదుపుతప్పిన చెరుకు ట్రాక్టర్ వెనుకకు దూసుకు రావడంతో ప్రయాణికులు వాహనదారులు ప్రాణ భయంతో పనికి పోయారు అదృష్టవశత్తు ఎవరికి ఎటువంటి ప్రాణహాని కలుగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు స్థానికులు తెలిపిన వివరాల ప్రకార గర్గుల్ గ్రామం వద్ద భారీ లోడుతో వెళు న్న ఒక చెరుకు ట్రాక్టర్ ఒక్కసారిగా ట్రాలీ ఓడిపోయి వెనుకకు దూసుకు వచ్చింది ట్రాక్టర్ అదుపుతప్పి వెనుకకు వస్తున్నటాన్ని గమనించిన కారు బైకు వాహనదారులు అప్రమత్తమై వెంటనే తమ వాహనాలను వెనక్కి తిప్పే ప్రయత్నం చేశారు అయితే అదే సమయంలో వెనుక నుండి వస్తున్న ఆర్టీసీ బస్సు వేగాన్ని నియంత్రించలేక చెరుకు ట్రాక్టర్లు బలంగా ఢీకొట్టింది ఈ క్రమంలో ఒక బైకు ఆర్టీసీ బస్సు వెనుక టైర్ కింద పడి నిజయింది బైక్ పై ఉన్న వ్యక్తి చకచక్యంగా పక్కకు దూకేయడంతో పెను ప్రమాదం తప్పింది





# మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

### కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి
### డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సందర్శించిన కలెక్టర్, అదనపు కలెక్టర్, అబ్జర్వర్





**నిజామాబాద్, ఫిబ్రవరి 10 :**
మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. పోలింగ్ నిర్వహణ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుండి పోలింగ్ సామాగ్రి తో సిబ్బంది తరలింపు, వెబ్ క్యాస్టింగ్ ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాలలో వసతులు, పోలీసు బందోబస్తు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, నిఘా బృందాల పనితీరు పర్యవేక్షణ తదితర అంశాలపై ఇప్పటికే అన్ని కసరత్తులు పూర్తి చేశామని అన్నారు.
మున్సిపల్ ఎన్నికలు ఈ నెల 11న జరుగనున్న నేపథ్యంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ అంకిత్, ఎన్నికల సాధారణ పరిశీలకులు సీహెచ్.సత్యనారాయణ రెడ్డి వేర్వేరుగా డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సందర్శించారు. నిజామాబాద్ నగర పాలక సంస్థకు సంబంధించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు, బోధన్ మున్సిపల్ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ అయిన విజయ మేరీ హైస్కూల్ ను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయగా, పీ.ఓ, ఏ.పీ.ఓ, ఓ.పీ.ఓలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యారా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు.
ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని సూచించారు. సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో సాఫీగా ఎన్నికలు జరిగేలా అంకితభావంతో కృషి చేయాలని ఎన్నికల సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. ఎక్కడ కూడా రీపోలింగ్ కు ఆస్కారం లేకుండా పక్కాగా పోలింగ్ ప్రక్రియను నిర్వహించాలని, ఓటింగ్ సందర్భంగా గోప్యతను కాపాడేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ జరిపిస్తున్నందున, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. పోలింగ్ బూత్ లలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే చర్యలను ఎంతమాత్రం ఉపేక్షించవద్దని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, వీల్ చైర్ వంటి వసతులతో పాటు, ప్రతి పోలింగ్ స్టేషన్లో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ప్రతి పీ.ఎస్ లో ఓటర్లకు సహకరించేలా బీ.ఎల్.ఓలతో కూడిన హెల్ప్ డెస్క్ లు అందుబాటులో ఉంచుతున్నామని అన్నారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ లో పాటించాల్సిన నిబంధనలు అమలయ్యేలా నిఘా బృందాలు కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేస్తున్నాయని తెలిపారు. ఉదయం 7.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. గడువు లోపు పోలింగ్ కేంద్రం లోనికి చేరుకున్న ఓటర్లకు సాయంత్రం 5.00 గంటలు దాటిన తరువాత కూడా టోకెన్లు జారీ చేసి, ఓటు వేసేందుకు అవకాశం కల్పించామన్నారు. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం కట్టుదిట్టమైన భద్రత నడుమ బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్ లకు తరలించాలని అన్నారు.
ఇదిలాఉండగా, అదనపు కలెక్టర్ అంకిత్, ఎన్నికల సాధారణ పరిశీలకులు సీహెచ్.సత్యనారాయణ రెడ్డి భీంగల్, ఆర్మూర్ పట్టణాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించి, పోలింగ్ సిబ్బందికి సూచనలు చేశారు. ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించి, చెక్ లిస్టు ప్రకారం సామాగ్రి అందిస్తున్నారా లేదా అన్నది పరిశీలించారు. అనంతరం అబ్జర్వర్ సత్యనారాయణ రెడ్డి నిజామాబాద్ పాలిటెక్నిక్ కళాశాలకు చేరుకొని ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరును నిశిత పర్యవేక్షణ జరిపారు. వీరి వెంట సంబంధిత మున్సిపల్ కమిషనర్లు, అధికారులు ఉన్నారు.

# అమెరికాకు మోకరిల్లిన వాణిజ్య ఒప్పందం రద్దు చేయాలి

### సిరికొండలో ట్రంప్--మోడీ దిష్టిబొమ్మల దగ్ధం

**నిజామాబాద్ రూరల్: ఫిబ్రవరి, 10 (ప్రజా జ్యోతి)**
అమెరికా ఒత్తిళ్లకు లోబడి భారత్ చేసుకున్న వాణిజ్య ఒప్పందాలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర నాయకులు పి. రామకృష్ణ డిమాండ్ చేశారు. భారత్--అమెరికా వాణిజ్య ఒప్పందాలను నిరసిస్తూ మంగళవారం సిరికొండ తెలంగాణ చౌరస్తాలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) ఆధ్వర్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోడీ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు.
ఈ సందర్భంగా పి. రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రపంచ పోలీసుగా వ్యవహరిస్తున్న అమెరికా తన ఆర్థిక దోపిడీ ప్రయోజనాల కోసం యుద్ధాలను ప్రోత్సహిస్తూ, ఆయుధాల విక్రయాలతో లాభాలు పొందుతోందన్నారు. అలాంటి అమెరికా తీవ్ర ఒత్తిళ్లకు లోబడి ప్రధాని నరేంద్ర మోడీ గుట్టుచప్పుడు కాకుండా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు.
పార్లమెంట్‌లో చర్చించకుండానే, దేశ ప్రజలకు వివరాలు వెల్లడించకుండా ఈ ఒప్పందాలు చేయడం వెనుక అసలు ఆంతర్యం ఏమిటో ప్రధాని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ వాణిజ్య ఒప్పందాలు దేశ సార్వభౌమాధికారానికి పెను ప్రమాదమని, దేశ పురోగతికి అడ్డంకిగా మారుతాయని పేర్కొన్నారు.
నూతన వాణిజ్య ఒప్పందాల వల్ల రైతాంగం, కార్మిక వర్గం, చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ముఖ్యంగా అమెరికా ఉత్పత్తులకు జీరో టారిఫ్ విధించడం వల్ల దేశీయ ఉత్పత్తులు దెబ్బతిని, చిన్న వ్యాపారుల జీవనాధారం ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రధాని మోడీ అమెరికాతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాలను పునఃసమీక్షించి, దేశ ప్రయోజనాల దృష్ట్యా రద్దు చేయాలని కోరారు.
ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) జిల్లా నాయకులు ఆర్. రమేష్, జి. కిషన్, డివిజన్ నాయకులు ఆర్. దామోదర్, బి. బాబన్న, ఎం. లింబాద్రి, బి. కిశోర్, మండల నాయకులు ఇ. రమేష్, ఎస్. కిశోర్, జి. బాల్ రెడ్డి, జి. ఎర్రన్న, ఎస్. గంగమల్లు, జి. బాబురావు, ఎల్. గోపి, జి. రాజు, వి. భూమగౌడ్, ఎస్. గంగారాం, బి. సర్పంచ్, బి. నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



# రైతు వేదికలో అగ్ని ప్రమాదం



**ధర్పల్లి :ఫిబ్రవరి/ 10 (ప్రజా జ్యోతి)**
నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో గల రైతు వేదిక ముందర ఉన్న చెట్లనుండి రాలిన ఆకులకు అగ్గి అంటుకొని నిప్పు వేగంగా రైతు వేదిక వైపు వస్తున్న మంటలను చూసి అక్కడ ఉన్న మహిళ రైతు రోడ్డుపైకి వచ్చి అగ్ని ప్రమాదం సంభవించింది దాని ఆరిపేసి ఉన్న మొక్కలను కాపాడాలంటూ అందరిని పిలిచి చెప్తున్నాది అది విన్న వ్యక్తులు వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చి చల్లారిపారు ఈ ప్రమాదంలో అక్కడున్న బోర్ కేసింగ్ కాలిపోయింది అధికారులు ప్రజాప్రతినిధులు చెట్లు నాటడమే కానీ వాటిని పర్యవేక్షణ శూన్యమైంది పర్యవేక్షణ లేని సందర్భంలో ఈలాంటి అగ్ని ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. అక్కడ నాటిన మొక్కలకు నీళ్ల లేవు వాటి ఆలన పాలన లేకుండా పోయింది అనడానికి ఇది ఉదాహరణ

# నీలా గ్రామంలో ప్రజబాట.



**రెంజల్, ఫిబ్రవరి 10(ప్రజాజ్యోతి ):**
రెంజల్ మండలంలోని నీల గ్రామంలో మంగళవారం ఏఈ కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ కిషోర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజలు నేరుగా తమ గ్రామంలోని విద్యుత్ స్టార్టర్లు, మోటార్లు, ట్రాన్స్ఫార్మర్ పోల్స్ వంటి విద్యుత్ మరమ్మత్తులు చేపట్టరాదని ఏదైనా విద్యుత్ సమస్యలు ఉన్నట్లయితే ఆ ఏరియా కు సంబంధించిన లైన్మెన్ లకు సంప్రదించాలని అజాగ్రత్తగా తమ సొంత నిర్ణయాలతో విద్యుత్ మరమ్మత్తులు చేపట్టరాదని అన్నారు. విద్యుత్ సంబంధించినటువంటి సమస్యలను చరవాణి ద్వారా తనకు తెలియజేసిన సమస్యలను పరిష్కరిస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ యోగేష్, ఉప సర్పంచ్ సుభద్ర, సబ్ ఇంజనీర్ హజార్, ఎస్ ఎల్ ఐ లింగం, లైన్మెన్లు అశోక్, శ్రీను, విజయ్, ఏఎల్ ఎం ప్రవీణ్ గౌడ్, గంగాధర్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ యూనివర్సిటీ పీజీ పరీక్షల రీషెడ్యూల్

**నిజామాబాద్ రూరల్: ఫిబ్రవరి, 10 (ప్రజా జ్యోతి)**
తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని అనుబంధ కళాశాలల్లో ఫిబ్రవరి 17 నుంచి నిర్వహించాల్సిన పీజీ మొదటి సెమిస్టర్, పీజీ ఇంటిగ్రేటెడ్ కోర్సుల మొదటి సెమిస్టర్, అలాగే ఐఎంబీఏ ఏడవ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసినట్లు వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య సంపత్ కుమార్ తెలిపారు. ఈ పరీక్షలు మార్చి 2 నుంచి నిర్వహించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. విద్యార్థులు తాజా పరీక్షా షెడ్యూల్‌కు అనుగుణంగా సిద్ధమవ్వాలని సూచించారు.

# కాసుల బాలరాజ్, ఆయన కొడుకు పై కేసు నమోదు చేయాలి

## కాసుల బాలరాజ్‌తో తనకు ప్రాణహాని ఉంది

ఆగ్రో పరిశ్రమల చైర్మన్ కాసుల బాలరాజ్, ఆయన కొడుకు రోహిత్ తనను సోమవారం అర్ధరాత్రి బాన్స్వాడ లో తన కారు ను అడ్డగించి తనపై దాడికి దిగారని వారిపై కేసు నమోదు చేయాలంటూ రుద్రూర్ మాజీ సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూర్ చంద్రశేఖర్ మంగళవారం బాన్సువాడ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తనపై మద్యం సేవించి అక్రమంగా దాడికి పాల్పడ్డ కాస్లో బాలరాజ్ ఆయన కొడుకు పై చర్యలు తీసుకోవాలని హిందూ చంద్రశేఖర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పి సభ్యులు కిషోర్ యాదవ్ మాట్లాడుతూ కాసుల బాలరాజ్ ఆయన కుమారుడు రోహిత్ ఉద్దేశపూర్వకంగా ఇందూరు చంద్రశేఖర్ బాన్సువాడ లోని తాడుకోల్ కు వచ్చినట్లు అందుకున్న సమాచారం మేరకు, బాన్స్వాడలో కాపు కాసి తన ఇంటికి రాత్రి పూట వెళుతున్న ఇందూరు చంద్రశేఖర్ వాహనాన్ని అడ్డుకొని ఒక రౌడీషీటర్ గా కాసుల బాలరాజ్ ఇందూరు చంద్రశేఖర్ పై ఉద్దేశపూర్వకంగా దాడి చేశారంటూ ఆయన ఆరోపించారు. ఈ విషయంపై పోలీసులు కాసుల బాలరాజు పై రౌడీ షీటర్ కేసు నమోదు చేయాలని కిషోర్ యాదవ్ డిమాండ్ చేశారు. చట్ట ప్రకారంగా కాసుల బాలరాజు పై చర్యలు తీసుకోకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని కిషోర్ యాదవ్ హెచ్చరించారు. ఒక ఉన్నత పదవిలో ఉన్న కాసుల బాలరాజ్, నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలహీన పడకుండా దశాబ్దాల కాలంగా కాంగ్రెస్ నే కన్న తల్లిగా పార్టీగా నమ్ముకుని కష్టకాలంలో కూడా సర్పంచి పదవులు చేపట్టి ఒకవైపు అభివృద్ధి, మరొకవైపు కాంగ్రెస్ పార్టీ బలహీన పడకుండా కృషి చేసిన ఇందూరు చంద్రశేఖర్ పై రౌడీషీటర్ గా కాస్లో బాలరాజ్ దాడులకు దిగడమే కాకుండా,




కాసులో బాలరాజ్ ఓటర్లకు పంచడానికి తెచ్చిన డబ్బులను ఇందూరు చంద్రశేఖర్ పై పడేసి డబ్బులు పంచడానికి ఆరోపణలు చేస్తూ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం ఎంతవరకు సమంజసం అంటూ కొత్తకొండ భాస్కర్ ప్రశ్నించారు. డబ్బుల విషయంలో అయ్యప్ప గుడిపై ఎక్కి ఇందూరు చంద్రశేఖర్ డబ్బులు తెచ్చినట్లు ప్రమాణం చేస్తావా? లేక తాము డబ్బు నీవేనని మేము అయ్యప్ప గుడికి ప్రమాణం చేస్తాం దమ్ముంటే అక్కడికి వచ్చి ప్రమాణం చేస్తావా? అంటూ కొత్తకొండ భాస్కర్ కాస్లో బాలరాజుకు సవాల్ చేశారు. బాన్స్వాడ పట్టణం కాసులో బాలరాజ్ అయ్యదా,? లేక కాసుల బాల రాజధా? బాన్సువాడ పట్టణంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఎవరు తిరగకూడదు? అంటూ కొత్తకొండ భాస్కర్ ప్రశ్నించారు. రౌడీ షీటర్ గా ఇందూరు చంద్రశేఖర్ పై చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు.

# ఇక అంతా ఓటర్ల చేతుల్లోనే..!

## ఆర్. రామ్మూర్తి. ఎంఏ

రామారెడ్డి ఫిబ్రవరి 10 (ప్రజా జ్యోతి)
నేను నాదేశ ప్రజలకు కత్తి చేతికి ఇవ్వలేదు.ఓటుహక్కు ఆయుధంగా ఇచ్చాను.పోరాడి రాజులవుతారో ..! అమ్ముకుని బానిసలవుతారో అది వారిచేతుల్లోనే ఉంది." అని ఏనాడో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సెలవిచ్చారు.అలాగే "గుడ్డగూబ పగలు చూడలేదు... కాకి రాత్రి చూడలేదు.. ఓటును అమ్ముకునే ప్రజలు ప్రగతిని,ప్రజాస్వామ్యాన్ని చూడలేరని" అబ్దుల్ కలాం చెప్పారు."ఈ ఎన్నికలు తో ఎన్నిక కావడాన్ని ప్రజాస్వామ్య బద్ధంగా అంటారని అబ్రహాం లింకన్ ఏనాడో సెలవిచ్చారు. ".ప్రజాస్వామిక దేశమైన మనదేశంలో అన్నిరాష్ట్రాలు భారత రాజ్యాంగాన్ని అమలుపరుస్తూ, దానను సారంగా నడుసుకుంటూ జీవితాలను కొనసాగిస్తున్నారు.అందులో భాగాంగాన్నే మనదేశంలో కూడా వంశాను క్రమ పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకువచ్చామని అనుకుంటున్నాము.రాష్ట్ర అభివృద్ధి అనేది..అక్కడ వుండే పాలకులమీద ఆధారపడిఉన్నదన్నది అందరికీతెలిసిందే.పాలకులు ఎన్నికకాబడాలంటే అది ఓటరుచేతుల్లో ఉంటుంది.ఇదికూడా మీకు తెలిసిందే.అంటే ఒకమంచివ్యక్తిని ఎన్నుకోవాలంటే ఓటరుయొక్క పాత్ర ఏ మేరలో ఉంటుందో అవగతమవుతుంది.అలాంటి సమయంలో ఓటరు ఎంతో జాగ్రత్తగా వ్యవహరించి,మంచి వ్యక్తిని ఎన్నుకొని, మంచి వ్యక్తిత్వం ఉన్న స్వభావం కలిగిన వ్యక్తిని అసెంబ్లీకి పంపడానికి పూనుకోవాలి.కానీ ఓటుహక్కును దుర్వినియోగ పరుచుకోవద్దు.ఓటుహక్కు అనేది భారతీయులకు భారతరాజ్యాంగం ఇచ్చిన గొప్ప ఆయుధం.కావున దానిని సమాజాభివృద్ధికై ఉపయోగించాల్సిన అవసరం ఎంతైనా ఉంటుంది.ఇక్కడ ఆశ్చర్యకర విషయం ఏమిటంటే గ్రామీణ సమాజాల్లో వుండే ఓటర్లకు ప్రజాస్వామిక విధానంపట్ల సరైన అవగాహనలేక,తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. అంటే ఒకకారణం ఉంటుంది.కానీ నగరాలలో ఎంతో అక్షరాస్యత కలిగిఉండి రాజ్యాంగంపట్ల, ప్రజాస్వామిక విధానంపట్ల, ఓటుయొక్క ప్రాధాన్యత గురించి అవగాహన ఉండి,వారే తమ ఓటుహక్కును వినియోగించుకోకుండా,పాలకులను ఎన్నుకోకపోవడం దేనికి నిదర్శనమో అర్థంకాని పరిస్థితి.వివిధ రాజకీయ పార్టీలు తమ ప్రచారంలో భాగంగా ఒకరి పైమరొకరు విమర్శించుకుంటూ,ఒకరిపై మరొకరుచివాట్లుపెట్టుకుంటూ అమలుకాని హామీలను ఇచ్చుకుంటూ,సినిమాడైలాగుల మేరలో పంచులు విసురుకుంటూ,పేద ప్రజలకు ఎన్నో వాగ్దానాలను ఇస్తారు. పలు నియోజకవర్గాలలో వివిధ రాజకీయపార్టీలపక్షాన నాయకులు పోటీలో నిలబడితే, మరికొంతమంది స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేస్తున్నారు.ఇలాంటి సందర్భంలో ఒకమంచివ్యక్తిని ఎన్నుకోవడంలో ఓటరు యొక్క ప్రాధాన్యత ఎంతుందో తెలియకనే తెలుస్తుంది.



ఈ సమయంలో ఓటరు మహాశయులు ఆలోచించి సక్రమమైన ప్రభుత్వాన్ని ఎన్నుకోకపోతే మరో ఐదేళ్ళు అభివృద్ధికి ఆమడదూరంలో భవితవ్యం ఉండక తప్పదు. ప్రస్తుతం తెలంగాణరాష్ట్రంలో 2026 లో మున్సిపల్ ఎన్నికలు జరగబోతున్నాయి.ఇప్పటికే ఎన్నికలకమిషన్ జరగబోవు ఎన్నికలకు అన్నిరకాల ఏర్పాట్లను పూర్తిచేసి, విధినిర్వహణలో ఉన్న సిబ్బందితో పోస్టల్ బ్యాలెట్ కార్యక్రమాన్ని ముగించకొని,ఎన్నికల ప్రక్రియను సజావుగా విజయవంతం చేయడానికి నిబంధనమైపోయింది.ఇక చివరిగా మిగిలింది రాష్ట్ర భవిష్యత్తును అభివృద్ధిదశలోకి తీసుకుపోయే నాయకులను ఎన్నుకునే ఓటర్ల చేతుల్లోనే మిగిలిఉన్నది.గత రెండుమూడు మాసాల నుండి రాష్ట్రంలోనే అన్ని రాజకీయపార్టీలలో ఉన్న నాయకులు స్వంత తమపరిధిలో ప్రచారపర్వం కొనసాగించి,చివరి అంకంకోసం నిమగ్నమైపోయారు.ఈ ప్రచారాలలో ఎన్నో ఆసక్తికర విషయాలు,సంఘటనలు చోటుచేసుకోవడం ఒకెత్తైతే,వివిధ న్యూస్ చానల్స్ లలో నిర్వహించే చర్చకార్యక్రమాలలో రాజకీయవిశ్లేషకులు,మేధావులు, రాజకీయవేత్త లు ఇచ్చిన సమాచారం సైతం రాష్ట్రప్రజలను ఆలోచింపజేసిందనడంలో నిజంలేకపోలేదు.ఇంకా ఆసక్తికరమైన విషయం ఏమిటంటే పార్టీలో నిర్వహించిన సర్వేలు మినహాయిస్తే,వివిధ సంస్థలు నిర్వహించిన సర్వేలుసైతం ఒక్కొక్కసారి ఒకపార్టీకి,ఒక్కొక్క అభ్యర్థికి ఆమోదం పలుకుతుందని చెప్పడం,ఒకెత్తైతే,క్షేత్రస్థాయిలో సైతం కొంతమంది పలు సమయాల లో ఎవరికి మద్దతునిస్తున్నారో తెలియకుండా ఒకింత ఆందోళనలకు గురిచేస్తున్నారనడంలో ఎలాంటి అవాస్తంలేదు. ఇదియేగాకుండా ప్రధాన రాజకీయ పార్టీలు ఒకరిపైమరొకరు చేసుకున్న ఆరోపణలు,ప్రతి ఆరోపణలు అందరూ తిలకించారు. చివరగా అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని వాస్తవాలను చర్చించి నిక్కచ్చైన నాయకుడిని ఎన్నుకోవడానికి నిర్ణయం తీసుకోవాల్సిన ఆవశ్యకత మిగిలి ఉన్నది.ఎలక్షన్ కమిషన్ విధించిన పరిమితుల మేరకు ఇక నిర్ణయం మన చేతిలోనే..!

# నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపుకు తెలంగాణ వర్సిటీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు




నిజామాబాద్ రూరల్: ఫిబ్రవరి, 10 (ప్రజా జ్యోతి)
మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో పుణె ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టరేట్ నిర్వహిస్తున్న నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపుకు తెలంగాణ రాష్ట్రం నుంచి తెలంగాణ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఎంపికయ్యారు. సావిత్రిబాయి పూలే పుణె విశ్వవిద్యాలయంలో ఈ నెల 11 నుంచి 17 వరకు జరగనున్న ఈ శిబిరానికి విద్యార్థుల బృందం మంగళవారం బయలుదేరి వెళ్లింది.ఈ క్యాంపుకు తెలంగాణ యూనివర్సిటీ తరపున కంటింజెంట్ లీడర్‌గా జీజీ కాలేజ్ నిజామాబాద్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీ దస్తప్ప వ్యవహరిస్తున్నట్లు తెలంగాణ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య అపర్ణ తెలిపారు. ఈ బృందంలో తెలంగాణ యూనివర్సిటీతో పాటు గవర్నమెంట్ గిరిరాజు కాలేజ్, రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ (దాస్‌నగర్), గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఆర్మూర్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ కామారెడ్డి, నిషిత డిగ్రీ కాలేజ్, ఆర్కే డిగ్రీ కాలేజ్, ఉషోదయ డిగ్రీ కాలేజ్ (బోధన్)లకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొంటున్నారు. సావిత్రిబాయి పూలే పుణె విశ్వవిద్యాలయంలో నిర్వహించే ప్రత్యేక శీతాకాల శిబిరంలో వారం రోజుల పాటు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు వివిధ పోటీ కార్యక్రమాల్లో పాల్గొని జాతీయ సమగ్రతపై అవగాహన పెంపొందించుకోనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య టి. యాదగిరిరావు, రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.అదేవిధంగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య అపర్ణ అధికారులు, సహకరించిన సంస్థలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఈ శిబిరంలో పాల్గొంటున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు శు భాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టరేట్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు గణితమే ప్రధానం

నిజామాబాద్ రూరల్: ఫిబ్రవరి, 10 (ప్రజా జ్యోతి)
ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యార్థుల భవిష్యత్తుకు గణిత విద్య కీలకమని, గణితంలో నైపుణ్యాలు పెంపొందించుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన సిరికొండ మండలంలోని సత్యశోధక్ పాఠశాల విద్యార్థులను మంగళవారం తన కార్యాలయంలో ఆయన అభినందించారు.విశ్వం ఎడ్యుటెక్ స్కూల్ ల్యాబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో టాపర్లుగా నిలిచిన బి. ప్రహర్ష, వి. సాద్వి, కె. రుగ్వేద, బి. లక్ష్మి ప్రసన్న, ఎన్. కార్తీక, ఎస్. ఆధిత్య, జి. అద్వైత్ రెడ్డి విద్యార్థులకు ప్రత్యేక జ్ఞాపికలు అందించి, శాలువాలతో సత్కరించారు.
ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. గణితంపై పట్టుదల, వేగవంతమైన లెక్కల నైపుణ్యం విద్యార్థుల మేధస్సు అభివృద్ధికి ఎంతో అవసరమని తెలిపారు. అబాకస్, వేదిక్ మ్యాథ్స్ వంటి శిక్షణ విధానాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు సమస్యలను తక్షణమే పరిష్కరించే సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచడం గర్వకారణమని పేర్కొంటూ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయుల కృషిని ఆయన అభినందించారు.
ఈ సందర్భంగా సత్యశోధక్ పాఠశాల కరస్పాండెంట్ ఆర్. నర్సయ్య, విద్యార్థులు కలిసి సుదర్శన్ రెడ్డిని సన్మానించి మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య, డీసీసీ కార్యదర్శి పి. గంగారెడ్డి, ఉపాధ్యాయుడు రాజు తదితరులు పాల్గొన్నారు

